# అసమగ్ర చిత్రం

**''గీత విషయమే నాకు బొత్తిగా అర్థం కాకుండా వుంది'' అన్నాడు రామ్మూర్తి ఒకసారి గట్టిగా నిట్టూర్చి!**

**కప్పులోని వెనీలా ఐస్‌క్రీంను కొద్దిగా స్పూన్‌తో తీసి చప్పరించి, ఆ రుచిని ఆస్వాదిస్తూ రామ్మూర్తి మొహంలోని చూశాను. ''కురుక్షేత్రంలో కర్తవ్యం బోధపడని అర్జునుని మొఖంలా వుందది''.**

ఆర్. రమేష్




కళ్యాణ మండపంలోంచి బాజాభజంత్రీలు గట్టిగా వినవస్తున్నాయి. హాలు బయటి లాన్ విద్యుద్దీపాలంకరణతో మిరుమిట్లు గొలుపుతోంది. పెళ్లి భోజనం చేసితీరుబడిగా బయటి లాన్‌లోని రెండు కుర్చీల్లో ఆశీనులైవున్నాం నేనూ, రామ్మూర్తి. భుక్తాయసంతో వక్కపలుకులు నములుతూ పెళ్ళికి వచ్చిన ఆహూతులు ఎవరికి వారు గుంపులు గుంపులుగా విడిపోయి పిచ్చాపాటిలో మునిగి తేలుతున్నారు. ఖద్దరు లాల్చీలూ, పట్టుచీరల రెపరెపలతో సందడిగా వుందా ప్రాంతం.

''గీత విషయానికేం? ఎమ్మెస్సీ గోల్డ్ మెడలిస్ట్. లక్షణమైన పిల్ల! దానిపాటికది బాంకులో వుద్యోగం సంపాదించుకొని, వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో నిక్షేపంలా వుంది. పదిరోజుల క్రితమే వాళ్ళ బాంకులో పనుండి వెళ్లా. ఏవో ఆఫీసర్ వుద్యోగాలకు ప్రిపేరౌతూ వుందిట'' అన్నాను ఐస్క్రీం కప్పులోని చివరి స్కూప్‌ను లాగించి.

''నీకేం! బ్రహ్మచారివి, సంసారమూ, ఆ బాదరాబందీలు నీకు ఆట్టే అర్థం కావు. పాతికేళ్లు నిండినా ఇంకా చదువూ, చట్టుబండలు అని అఘోరిస్తూ వుంటే దాని పెళ్లి పెటాకుల మాటేమిటి? నా మాటా, వాళ్ళ అమ్మ మాటా ఈ విషయంలో బొత్తిగా ఖాతరు చేయదు. అసలే మా ఇద్దరి ఆరోగ్యాలు అంతంత మాత్రంగా వున్నాయి'' అన్నాడు రామ్మూర్తి దిగులుగా.

ఇంతలో విశ్వనాథం ఎవరో అతిథులను సాగనంపడానికి హడావిడిగా అటు వచ్చాడు. వాళ్ల ఆఫీసు స్టాఫనుకుంటా, అదేపనిగా విశ్వనాథం చేతులు పట్టుకొని వూపేస్తూ, గారిగా నవ్వుతూ శలవు




తీసుకుంటున్నారు. అంత హడావిడిలోనూ మరో రెండు క్షణాల సమయం కేటాయించడం మరిచిపో లేదు విశ్వనాథం.

''అదృష్టవంతుడివి విశ్వనాథం, వున్న వూళ్ళోనే నీ కూతురికి మంచి సంబంధం దొరికింది. ఈ రోజుల్లో సివిల్ ఇంజనీరుకి లక్షరూపాయల కట్నం అంటే కారు చౌకే, మనవాళ్లలో'' అన్నాడు రామ్మూర్తి!

''ఏమదృష్టమో ఏమో! మేరేజ్‌హాల్ రెంటూ, కేటరింగూ, పురోహితులూ, భజంత్రీలే గాక చీర లనీ, నగలనీ పిండాకూడనీ ఇప్పటికే నాలుగు లక్షలు దాటింది అక్కౌంటు. నా జీవితకాలపు జీపీ యపు సేవింగ్సు పెళ్లి ఖర్చులకు కూడా సరిపో లేదు. సరేలేకాని, ఇన్నాళ్లకు నువ్వు, నేనూ, ముకుందం ఇలాగైనా కలిశాం. చాలా ఆనందంగా వుంది'' అన్నాడు విశ్వనాథం.

ఇంతలో విశ్వనాథం రెండో కొడుకు హడావి డిగా వచ్చి, ''నాన్నా, నిన్ను బాబాయి వెంటనే రమ్మంటున్నాడు'' అని పిలిచాడు, గాభరాగా.

''ముహూర్తం వరకూ క్షణం తీరికుండదు గదా, మళ్లీ కలుద్దాం'' అని విశ్వనాథం హాలులోపలికి వేగంగా వెళ్లిపోయాడు. మేము మళ్లీ టాపిక్కుకు వొచ్చాం.

నేనీసారి గీతోపదేశం పొందగోరే అర్జునుడిలా మొహం పెట్టాను. రామ్మూర్తి గొంతు సవరించుకు న్నాడు.

''మా గీతను నువ్వు చిన్నప్పట్నుంచి ఎరుగు దువు. దానికి నేనెంతో నువ్వూ అంతే, మొహ మాటం కొద్దీ దాని మనసులో మాటను నాకు చెప్ప లేకపోవచ్చు. దాని వుద్దేశమేమిటో సరిగ్గా కను క్కొని నాకు ఫోన్ చెయ్యి. ఐదారు లక్షలు సమకూ ర్చడం నాకు పెద్ద పని కాదు. నాలుగు నెలల్లోనే దాని మనువు చేసెయ్యగలను'' అన్నాడు.

లక్షల గురించి రామ్మూర్తి అంత ఉల్హాగా మాట్లాడాడు గాని, వాడి స్తోమతు నాకు తెలి యంది గాదు. నాకూ, రామ్మూర్తికి, ఆ మాటకొస్తే విశ్వనాథానికి కూడా జీతపు రాళ్ళే ఆధారం. ముప్పై ఏళ్ల క్రితం మేము ముగ్గురం ఒకే ఆఫీసులో చిరుద్యోగులుగా జాయినైనప్పటి నుంచి, ఇరవై ఏళ్ల క్రితం జరిగిన మాస్ ట్రాన్స్‌ఫర్స్‌లో మేము తలొకదారయ్యేవరకూ కలిసి పనిచేసినవాళ్లం. ఎదుగూ, బొదుగూ లేని వుద్యోగంలో అప్పులే కుండా ఏ నెలకానెల నెట్టుకు రావడమే గగనమ య్యేది. ఇక రామ్మూర్తికి గాని, విశ్వనాథానికిగాని సేవింగ్సు ఖాతాలు పెద్దగా వుండే అవకాశమే లేదని నాకు తెలుసు. కేవలం ఆడపిల్ల తండ్రిగా వుండే ''బాధ్యతో, భయమో, పరువూ మర్యాదో'' రామ్మూర్తితో అలా మాట్లాడిస్తూ వుందని కూడా నాకు తెలుసు.

''నేను గీతతో మాట్లాడుతాను. నువ్వు నిశ్చిం తగా వుండు'' అన్నాను కృష్ణపరమాత్మలా అభయ మిస్తూ!

మోగుతున్న అలారం టైం పీసును ఆఫ్ చేసి బద్ధకంగా లేచాను. డాక్టరు సలహా మేరకు నెలరో జులుగా వుదయాన్నే ఐదింటికి లేచి వాకింగ్‌కు వెళ్తు న్నాను. మొఖం కడుక్కుని, అద్దం ముందు నిల్చుని తలదువ్వుకునే సమయంలో యధాలాపంగా నా దృష్టి ఆ ఫోటో మీద పడింది.

మేము వుద్యోగంలో చేరిన తొలిరోజుల్లో తీసు కున్న ఫోటో అది. ''నేనూ, రామ్మూర్తి, విశ్వనాథం'' ముగ్గురం ఫోటోలో చిరునవ్వులు చిందిస్తూ దర్జాగా దర్శనమిస్తున్నాం. నో డౌట్, మా చెలిమికి తీపి గుర్తు ఆ ఫోటోనే! అందుకే దాన్ని నేనెక్కడున్నా, గదిలోని ఏదో ఒక గోడ మేకుకు తగిలించేవుంచు తాను. కానీ క్రమేపీ కొన్నాళ్లకు ఫోటోలో నా చిరు నవ్వు చెదిరి విషాదఛాయలు నాకు దర్శనమిచ్చేవి.

అందుకు కారణాన్ని వూహించడం కష్టం కాదు.

అరిస్టాటిల్ కాబోలు ఒకసారి అన్నా డట, ''పెళ్లి చేసుకున్న వాళ్లూ, చేసుకోని వాళ్లూ ఇద్దరూ కొన్నాళ్లకు చింతిస్తారట. పెళ్లి తొందరపడి చేసుకొని, నానారకా లైన బాధ్యతలు మోయవలసివచ్చిం దనీ, హాయిగా పెళ్లి పెటాకులు లేకుండా గడిపుంటే బావుండేదని పెళ్లైన వాళ్లూ, పెళ్లైన వాళ్లు హాయిగా వున్నారని, తాము పెళ్లి చేసుకోకుండా పొరబాటు చేశామని పెళ్లి చేసుకోని వారు చింతిస్తారు.''

కుటుంబ సమస్యలు, అక్క చెల్లెళ్ల పెళ్లిళ్ల వలన నాకు నలభై ఏళ్ల వరకూ పెళ్లి గురించి ఆలోచన కలగలేదు. ఆ తరువాత పెళ్లి చేసుకోవాలనిపించ లేదు. కానీ ఫోటోలో విశ్వనాథం, రామ్మూర్తులను చూసినప్పుడల్లా, నేను వాళ్లలానే పెళ్లిచేసుకొని పిల్లాపాపలతో హాయిగా సంసారం చేస్తూ వుండి వుంటే బావుండేదనిపించేది నాకు. ఆ సమయంలో మా ఫోటోలో నేను మాత్రం మూతి ముడుచుకుని వుంటే విశ్వనాథం, రామ్మూర్తులి ద్దరూ నవ్వుతూ వున్నారనిపించేది నాకు.

కానీ ఈ దినం నాకు ఆ ఫోటో కొద్దిగా డిఫ రెంట్‌గా అనిపించింది. అప్పో, సప్పో చేసి కూతురి పెళ్లి చేసి భారం దింపుకున్న విశ్వనాథం ఫోటోలో ఆనందంగా నవ్వుతూ వుంటే, రామ్మూర్తి మాత్రం దిగులుతో కుంగిపోతున్నట్లు అనిపించింది. ఈ సంసార జంజాటాలు లేని నేను కూడా విశ్వనాథా నికి తోడుగా ఆనందంగా వున్నట్లే కనిపించింది నాకు.

ఈ చిత్రాన్ని సరిచేసి, రామ్మూర్తి మొఖంలోకి మళ్లీ చిరునవ్వు తెచ్చి, ఫోటోకు మునుపటి కళ ప్రసారించవలసిన గురుతరమైన బాధ్యత నా మీద వున్నట్లు హఠాత్తుగా గుర్తొచ్చింది నాకు. వరుసగా ఆడిట్లూ, ఇన్స్‌పెక్షన్లూ వుండడంతో ఆఫీసు పనిలో గీత విషయమే గుర్తుకు రాలేదు ఇన్ని రోజులూ.

పదకొండింటికి గీత పని చేసే బాంకుకు ఫోన్ చేసి, సాయంత్రం ఐదింటికి ఆమెతో మాట్లాడ్డానికి వాళ్ల బ్యాంకి దగ్గరకు వస్తానన్నాను. '' ఏవన్నా అర్జెంటు విషయమా అంకుల్?'' అంది గీత. లేద న్నాను. ఐతే ఎల్లుండికి నేనే మీ ఆఫీసున్న వీధిలోనే ఒక బ్రాంచికి స్పోర్ట్స్ మీట్ గురించి వస్తున్నా. అలాగే మీ ఆఫీసుకొచ్చి మీతో మాట్లాడుతాను లెండి'' అంది గీత.

అన్నట్లుగానే పావుతక్కువ ఐదింటికి మా సెక్షన్ దగ్గరకు వచ్చింది గీత. చేస్తున్న 'రికన్సిలేషన్ వర్క్'ను ఆపి, పేపర్లను ఫైల్లో పెట్టి టేబిల్ డ్రాయ ర్లోకి తోసి, సొరుగును లాక్ చేసి లేచి, ఆఫీస్ కాంటిన్ వైపు నడిచాను. ఏవో కుశల ప్రశ్నలు వేస్తూ గీత నన్ననుసరించింది.

కాసేపు ఆమె చేస్తున్న వుద్యోగం గురించి,

హాస్టల్లో తిండి, వసతుల గురించి ఎంక్వైరీ చేసి పాయింటుకి వచ్చా. గీత నా మాటలు విని మౌనంగా కిటికీలోంచి చూస్తూ వుండిపోయింది.

"మీ నాన్నకా. బీపీ, షుగర్‌లతో బాటు అల్జిమీర్స్ కూడా అటాక్ ఐనట్లుంది. నీ పెళ్లి వాయిదా వేస్తూ ఆయన్నిలా బాధపెట్టడం సబబుగా వుందా?" కొంత కఠినంగానే అడిగాను.

"నాన్న హెల్త్ గురించి నాకూ దిగులుగానే వుందంకుల్. కానీ నాకిప్పట్లో పెళ్లి చేసుకోవాలని లేదు" అంది గీత.

కేంటిన్ కుర్రాడు తెచ్చిన కాఫీని ఒక గుటక వేసి అడిగాను.

"నీ మనసులో మాట నాకు స్పష్టంగా చెప్పు. నో ఇన్హిబిషన్స్" లీడ్ చేస్తూ అన్నాను.

"అదికాదంకుల్, నాన్నకు బంధుమిత్రులందరినీ పిలిచి గ్రాండ్‌గా నా పెళ్లి చేయాలనుంది. అన్ని ఖర్చులూ కలిపి ఆరులక్షల దాకా ఔతుందని అమ్మతో చెప్తుండగా విన్నాను. జీవితకాలపు సేవింగ్స్ అంతా నా పెళ్లికే ఖర్చు బెట్టే తరువాత అమ్మా, నాన్నల గతి ఏమిటి? తమ్ముడా, ఇంకా డిగ్రీలోనే వున్నాడు. వాడి పై చదువులకు సోర్స్ ఏముంటుంది?" అంది గీత కప్పులోని కాఫీని సాసర్‌లోకి వంచుతూ.

"అలాగని నీ నిర్ణయాన్ని ఇన్‌డెఫినెట్‌గా పోస్ట్‌పోన్ చేస్తూ పోతావా? ఈ సమస్యలన్నీ అందరు మధ్య తరగతి అమ్మాయిలకూ వుంటాయి. పైగా నువ్వుద్యోగం చేస్తూ ఆర్థికంగా స్థిమితపడి వున్నావు కూడా" అన్నాను అనునయంగా.

"నాసేవింగ్స్‌తో అమ్మా, నాన్నలకొక నివాసాన్నేర్పరిచిన తరువాతే పెళ్లి మాట తలపెట్టాను కుంటున్నాను. బాంక్‌లో తక్కువ వడ్డీకి హౌసింగ్ లోను కూడా తీసుకోవచ్చు. తరువాతైనా, కట్నం అడక్కుండా, సింపుల్ మేరేజ్‌కి అంగీకరించే వాడితోనే" అంది గీత స్థిరంగా.

"రామ్మూర్తి నీ నుంచి ఏదో సాయాన్ని ఆశిస్తాడనుకోవడం పొరబాటు. పెళ్లి ఘనంగా చేయకపోతే నలుగురూ ఆడిపోసుకుంటారంటాడు మీ నాన్న. ఎలాగోలా పెళ్లి చేస్తే తరువాత చిన్నగా ఆ అప్పులు తీర్చుకోవచ్చు" అన్నాను. నావాదన నాకే అసమగ్రంగా అనిపించింది..

నేనెంత నచ్చచెప్పినా గీత తన పట్టు వదల్లేదు. చివరకు నేనే రాజీ పడాల్సొచ్చింది.

ఆ రాత్రి రామ్మూర్తికి ఎస్టీడీ బూత్ నుంచి ఫోన్ చేశాను.

"ఏమనుకొంటోందది, పెద్ద ఆరిందాలా ఫీలవుతున్నట్లుంది. మెడలు వంచైనా ఈ ఏడాది దాని పెళ్లి జరిపిస్తాను. తరువాత మా పాట్లేవో మేం పడ్తాం. దానికెందుకు నా బాధలు కుఠచేష్టలు కాకపోతే" అని రుసరుసలాడాడు రామ్మూర్తి.

ఆఫీసు పనిలో పడి నేను కొన్ని వారాలు ఆ విషయం పట్టించుకోలేదు. ఒక రోజు రామ్మూర్తి మా ఆఫీసుకొచ్చి, ఎంత నచ్చజెప్పినా గీత పెళ్లికి ఒప్పుకోవడం లేదని బాధపడి వెళ్లిపోయాడు.

ఫోటోలో నానాటికి రామ్మూర్తి మఖంలో జీవకళ నశిస్తోంది. ఇలా కాదని, ఒకరోజు సాయంత్రం ఆ ఫోటోని తీసి ట్రంకుపెట్టె అడుగున దాచిపెట్టా.

ఆరునెల్ల తరువాత ఒక రోజు విశ్వనాథం నాతో పనిబడి మా ఆఫీసుకొచ్చాడు. మాటల్లో, ఇల్లు కట్టుకోవడానికి గీత సాయం చేయబోతే రామ్మూర్తి, నిరాకరించినట్లు చెప్పాడు. అలాగే కూతురి పెళ్లికే వున్నదంతా ఖర్చు బెట్టి, ' ఇంటిఖర్చులకు, కేన్సరు పేషంటైన భార్య వైద్యం ఖర్చులకూ' నానా ఇబ్బంది పడ్తున్నట్లు చెప్పాడు.

రెండేళ్ళు ఇట్టే గడచిపోయాయి. నా రిటైర్మెంటు తేదీ దగ్గర పడుతోంది. పదవీ విరమణ తరువాత ఒక ఇంటర్‌నెట్ ఛాటింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలనుకున్నా. పెట్టుబడికి నాకేం ఢోకాలేదు. ఒంటిగాణ్ణి గదా!

"ఏమనుకొంటోందది, పెద్ద ఆరిందాలా ఫీలవుతున్నట్లుంది. మెడలు వంచైనా ఈ ఏడాది దాని పెళ్లి జరిపిస్తాను. తరువాత మా పాట్లేవో మేం పడ్తాం. దానికెందుకు నా బాధలు కుఠచేష్టలు కాకపోతే" అని రుసరుసలాడాడు రామ్మూర్తి.

ఒకరోజు హఠాత్తుగా గీత దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. రెండు వారాల్లో తన పెళ్లి వుందిట. విషయం నాకేం బోధపడలేదు. సాయంత్రం ఐదింటికి వాళ్ల బాంక్ దగ్గరకు వెళ్లాను.

"వాళ్ల కొలీగ్ శ్రీనాథ్, గీత ఆదర్శాలు, భావాలు అన్నీ విని, అన్నిటికీ సమ్మతించి పెళ్లి కొప్పుకున్నాడట. ఇక పెళ్లి జరిగేది రిజిస్టర్ ఆఫీసులో. తరువాత ఒక యాభై మందికి సింపుల్‌గా ఫలహారాలు, స్వీట్లు సరఫరా చేయబడతాయి."

"రిజిస్టర్ ఆఫీసులో మీరూ ఒక సాక్షి సంతకం చెయ్యాలంకుల్" అభ్యర్థనగా అంది గీత. నాకేం చెప్పాలో తోచలేదు.

"ఈ విషయం రామ్మూర్తికి తెలుసా?" ఏమీ తోచక అడిగాను.

"నెల రోజుల క్రితమే చెప్పాను. ఆయన ఎప్పటి నుంచో నాతో మాట్లాడ్డం లేదు. వూర్లోనే ఒక అపార్ట్‌మెంటు ఆయన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాను. ఆ కాగితాలు కూడా తీసుకోలేదు. పెళ్లికెలాగూ ఒప్పుకోరు" అంది గీత.

కొంతలో కొంత నయమే. ఆ శ్రీధర్‌ది కూడా రామ్మూర్తి కులమే.

ఆ రాత్రికి రామ్మూర్తికి ఫోన్ చేశాను. ఆ పెళ్లెలా జరుగుతుందో చూస్తానని చిందులు తొక్కాడు. నన్నా జాడలకు వెళ్లవద్దన్నాడు బంధువులకు తెలిస్తే పరువు గంగలో కలుస్తుందని ఆవేశపడ్డాడు చాలాసేపు.

పెళ్లిరోజు దగ్గరౌతున్న కొద్దీ నాలో టెన్షన్ పెరుగుతోంది. ఆఖరికి తేదీ రానే వచ్చింది. పొద్దునే గీత నుంచి ఫోన్ కూడా.

ఏ మాత్రం ఆలోచించకుండా రిజస్టర్ ఆఫీస్‌కు వెళ్లి సాక్షి సంతకం చేశాను. కొలీగ్స్ సమక్షంలో గీత పెళ్లి సింపుల్‌గా జరిగిపోయింది.

రెండ్రోజుల తరువాత రామ్మూర్తి మా ఆఫీసుకు వచ్చి నా మీద రంకెలు వేశాడు. అసలు తనకు గీత ఇక కూతురే కాదన్నాడు. నా గీతోపదేశం రామ్మూర్తిపై ఏ మాత్రం పని చేయలేదు.

మరో ఏడాది ఇట్టే గడిచింది. రిటైరై, పార్ట్‌టైం బిజినెస్‌తో హాయిగా కాలం కడుపుతున్నా. ఇంటర్‌నెట్ సెంటర్ బాగానే నడుస్తోంది మంచి లొకాలిటీలో వుండడంతో స్నేహితులు, టీవీ, సీడీలు, బుక్స్‌తో బాగానే కాలక్షేపం ఔతోంది.

హఠాత్తుగా ఒక రోజు విశ్వనాథం నా గదికి వూడిపడ్డాడు.

జుట్టు బాగా నెరసిపోయి, మనిషి బాగా చిక్కిపోయి వుండడంతో అస్సలు గుర్తు పట్టలేక పోయా. కొడుక్కి పెళ్లై మరో వూర్లో కాపురం పెట్టాడట. వాడి జీతం వాడిసంసారానికే చాలదట. ఇల్లు కట్టుకోలేక విశ్వనాథం, వాడి భార్యా అద్దె కొంపలోనే కాలం వెళ్లబుచ్చుతున్నారట. "రోగాలూ, రొష్టులూ, డాక్టర్లు, మందులతో బాటు కూతురి కాన్పులు, మనవళ్ళ బారాసారలకు తడిసి మోపెడు ఖర్చవుతోందట. అన్నిటికీ డబ్బు సర్దలేక నానా యాగీ ఔతోందట వాడి పని.

"మరి రామ్మూర్తి వుండేది మీ వూర్లోనేగా, వాడెలా వున్నాడు?" అన్నాను ఆసక్తిగా.

"వాడికేం కూతురు కొనిచ్చిన అపార్ట్‌మెంట్లోకి మారాడు. పెన్షన్ డబ్బులు, జీపీ ఎఫ్ డబ్బులు, మిగిలిన సేవింగ్స్ అంతా అలానే వున్నాయి. దేనికీ హైరానా పడవలసిన అవసరం లేదు" అన్నాడు విశ్వనాథం. రెండువేలు నా దగ్గర అప్పు తీసుకొని వెళ్లాడు. నా కంతా అయోమయంగా అనిపించింది. "కాలంతో బాటు, మనవడు పుట్టేసరికి రామ్మూర్తిలో మార్పు వచ్చివుంటుంది" అనిపించింది నాకు.

ట్రంకు పెట్టెలోంచి ఫోటోను తీసి, దుమ్ముదులిపి గోడకు తగిలించాను. ఈసారి ఫోటోలో "నేనూ, రామ్మూర్తి" చిరునవ్వులు చిందిస్తూ వుంటే "విశ్వనాథం మిన్ను విరిగి మీద పడినట్లు" బాధ పడుతూ వున్నాడు ఫోటోలో. వాడి బాధ తీర్చే సాధనం ఏదీ నాకు దరిదాపుల్లో కనిపించలేదు.

★